

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

నల్గొండ యాదాద్రి సూర్యాపేట

ఆదివారం 20, జూలై 2025 పేజీలు - 8








# బ్రాహ్మణ వెల్లెంల రిజర్వాయర్‌ను మంత్రి ఆకస్మిక తనిఖీ

## రాష్ట్ర రోడ్లు భవనాలు, సినీ ఆటోగ్రఫీ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో**

బ్రాహ్మణ వెల్లెంల రిజర్వాయర్‌ను రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజర్వాయర్‌లో రెండు పంపుల ద్వారా ఇప్పటి వరకు లిఫ్ట్ చేసిన నీటి నిల్వలపై అధికారులను ఆరా తీశారు. ఉదయ సముద్రం నుండి ఇప్పటి వరకు 0.20 టిఎంసి నీటిని లిఫ్ట్ చేశామని అధికారులు మంత్రికి వివరించారు. నాగార్జునసాగర్‌లో నీటిమట్టం పెరుగుతున్నందున రెండు పంపుల ద్వారా ఒక్కో పంపు 460క్యూసెక్కుల కెపాసిటీ చొప్పున రోజుకు 920 క్యూసెక్కుల నీటిని ఉదయ సముద్రం నుండి లిఫ్ట్ చేసి రిజర్వాయర్ ఫుల్ లెవల్ 0.305 టిఎంసి వరకు నింపాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్ కింద చెరువులు నింపి సాగు నీరు అందించేందుకు ఏర్పాటు చేసుకుంటున్న లెఫ్ట్, రైట్ కెనాల్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. లెఫ్ట్ మెయిన్ కెనాల్ ద్వారా 30చెరువులు, రైట్ మెయిన్ కెనాల్ ద్వారా 20చెరువులు నింపేందుకు వీలుగా వర్క్ ఏజెన్సీలు యుద్ధ ప్రాతిపదికన కెనాల్ పనులు పూర్తి చేయాలన్నారు. రైతుల పంట పొలాలకు సాగు నీరు అందించే ఫీడర్ చానెల్ కెనాల్ తవ్వకానికి ఎస్టిమేట్స్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నల్గొండ మండలం దోమలపల్లి గ్రామ చెరువు అతి త్వరలో సుమారుగా 10రోజుల్లో నింపి సాగు నీరు అందించేందుకు నిర్విరామంగా పని చేయాలని కెనాల్స్ పినిషింగ్ వర్క్స్ వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్ట్ కింద భూసేకరణ ద్వారా భూమి కోల్పోయిన రైతుల ఖాతాల్లో వెంటనే పరిహారం డబ్బులు జమ చేయాలని ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్‌ను ఫోన్లో ఆదేశించారు. గత డిసెంబర్ లో ప్రారంభించుకున్న ఈ రిజర్వాయర్ ద్వారా ఇప్పటి వరకు 15వేల ఎకరాలకు సాగు నీరు అందించామని, లక్ష ఎకరాలకు సాగునీరు అందించడమే తన ధృఢ సంకల్పమని మంత్రి పునరుద్ఘాటించారు. మంత్రి ఆకస్మిక తనిఖీకి వెళ్లినప్పుడు ఫీల్డ్ విజిట్‌లో ఉన్న ఇరిగేషన్ ఇంజనీర్లను ఈ సందర్భంగా అభినందించారు. రైతు పట్ల ప్రతి ఒక్కరూ కమిట్మెంట్‌తో పనిచేయాలని వారికి సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీ సందర్భంగా నల్గొండ ఇరిగేష్ ఈ.ఈ శ్రీనివాస్ రెడ్డి, డి.ఈ విఠలేశ్వర్, డిప్యూటీ డి.ఈ పిచ్చయ్య, ఏ.ఈఈలు రాజశేఖర్, నవీన్, జితేందర్‌తో పాటు మంత్రి వెంట పలువురు ఉన్నారు.

# రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

## శాసనమండలి సభ్యులు శంకర్‌నాయక్




**నల్గొండ జిల్లా బ్యూరో**

రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని శాసనమండలి సభ్యులు శంకర్ నాయక్ అన్నారు. శనివారం ఆయన నల్గొండ ఆర్డీవో కార్యాలయంలో నల్గొండ నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కార్డులను ఎమ్మెల్సీ శంకర్ నాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత ప్రభుత్వం గడిచిన 10 సంవత్సరాలలో ఒక్క రేషన్ కార్డు మంజూరు చేయలేదని, అలాంటిది తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన రేషన్ కార్డులను ఇస్తున్నదని తెలిపారు. తమ ప్రభుత్వం పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. రేషన్ కార్డులు రానివారు అధైర్య పడాల్సిన అవసరం లేదని, ఇది నిరంతరం కొనసాగే ప్రక్రియ అని చెప్పారు. కార్యక్రమానికి హాజరైన రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో మొట్ట మొదటిసారిగా సన్నబియ్యాన్ని పంపిణీ చేసిన రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. సన్న బియ్యం దుర్వినియోగం కాకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రేషన్ కార్డులు రాని వారందరూ రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఇది నిరంతరం కొనసాగుతుందని, అందువల్ల ఎవరు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని తెలిపారు. కాగా నల్గొండ నియోజకవర్గంలో శనివారం వరకు 10,001 కొత్త రేషన్ కార్డులను ఇవ్వడం జరిగింది. అంతేకాక 12733 మందిని రేషన్ కార్డులలో నమోదు చేయడం జరిగింది. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద 204 మందికి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వనమహోత్సవం కింద ఎమ్మెల్సీ, రెవెన్యూ అదనపు కలెక్టర్, ఆర్డీవో, సిబ్బందితో సహా ఆర్‌డిఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నల్గొండ ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూపూడి రమేష్, డిసిసి డైరెక్టర్ సంపత్ రెడ్డి, కౌన్సిలర్ ఉన్న గణేష్ ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు 50 శాతం గ్రౌండింగ్ చేయాలి

## జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశం



**నల్గొండ జిల్లా బ్యూరో**

కట్టంగూరు మండలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా మండలానికి మంజూరైన గృహాలలో వచ్చే బుధవారం నాటికి 50 శాతం గ్రౌండింగ్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం ఆమె కట్టంగూరు ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి పై సమీక్ష నిర్వహించారు. గ్రామపంచాయతీలవారిగా సమీక్ష నిర్వహించిన అనంతరం ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు గ్రౌండింగ్ కానీ గ్రామాలలో వెంటనే ఇండ్ల నిర్మాణం మొదలుపెట్టేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు .గ్రౌండింగ్లో పురోగతి లేనట్లయితే సంబంధిత కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఆదివారం, సోమవారం 2 రోజులు ఇంకా ఎక్కువగా పనిచేసి పురోగతి తీసుకురావాలని ఆదేశించారు. ఏపీఓతో వనమహోత్సవం పై సమీక్షిస్తూ వనమహోత్సవం కింద మండలానికి నిర్దేశించిన లక్ష్యం ప్రకారం గుంతలతవ్వకం, మొక్కలు నాటడం సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. ఆన్‌లైన్ వివరాలన్నీ ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. నల్గొండ ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, గృహనిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, కట్టంగూర్ ఎంపీడీవో, గ్రామపంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఈ సమీక్షకు హాజరయ్యారు.

# అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం



మునగాల, మేజర్‌న్యూస్ : మునగాల మండల పరిధిలోని ముకుందాపురం గ్రామ శివారులో ఉన్న ఇందిరా వృద్ధాశ్రమంలో శనివారం కోదాడ మండలం కాపుగల్లు గ్రామనికి చెందిన మందలపు చిన్న సుబ్బారావు నాగరాణి కుమార్తె మందలపు దేవకి పుట్టినరోజు సందర్భంగా అనాథాశ్రమంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎలమంచిలి శ్రీనివాసరావు, ఆశ్రమం నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, ఇన్చార్జి జ్యోతి సిబ్బంది దేవికా సిస్టర్, హర్ష, పాల్గొన్నారు.

# భక్తులకు మరింత మెరుగైన సేవలు

### యాదగిరిగుట్ట దేవస్థానం ఈవో ఎస్.వెంకట్రావు ఐఏఎస్



యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనానికి విచ్చేయు భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నామని ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. శనివారం యాదగిరిగుట్ట దేవస్థానం ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. యాదగిరిగుట్ట దేవస్థానంలో ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులు చేసుకుంటూ భక్తులకు అన్ని విధాలుగా సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అనేక ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన విధంగా చర్యలు చేపడుతున్నామని అన్నారు. భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ యొక్క యాదగిరిగుట్ట క్షేత్రం ఒక ఆలయంగానే కాకుండా ప్రపంచ స్థాయిలో ఆధ్యాత్మిక కేంద్రంగా వెలసిల్లేందుకు తగిన విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందుకోసం వివిధ ప్రాంతాలలోని గురువులు ఆధ్యాత్మికవేత్తల యొక్క సలహాలు సూచనలు తీసుకుంటున్నామని అన్నారు. వారి సలహాలు సూచనల మేరకు ప్రభుత్వంతో ఉన్నతాధికారులతో చర్చించి ఆలయంలో అనేక రకాలైన మార్పులు చేర్పులు తీసుకురావడమే కాకుండా ఈ ఆలయాన్ని ఒక దివ్య ఆధ్యాత్మిక క్షేత్రంగా, ఆధ్యాత్మిక నిలయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. యాదగిరిగుట్టకు త్వరలో ఒక మాసపత్రికను అదే విధంగా ఒక టీవీ ఛానల్ ను ఏర్పాటు చేయనున్నమని అన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాటు జరుగుతున్నాయని తెలిపారు. ఇందుకోసం సంబంధిత శాఖకు దరఖాస్తు చేశామని తెలిపారు. ఛానల్ మాసపత్రిక ద్వారా యాదగిరిగుట్ట దేవస్థానంలో నిత్యం జరుగుతున్న అనేక కార్యక్రమాలను భక్తులకు తెలియజేసేందుకు వీలు కలుగుతుందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా యాదగిరిగుట్ట దేవస్థానానికి ఉన్నటువంటి భక్తులకు యాదగిరిగుట్ట దేవస్థానంలో జరుగుతున్నటువంటి మార్పులు, చేర్పులు స్వామివారి దర్శనం వేళలు ఇతరత్రా అన్ని రకాల వివరాలను సమగ్రంగా తెలియజేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఇందుకు మాసపత్రిక టీవీ ఛానల్ తోడ్పడుతుందని అన్నారు అదేవిధంగా మరి కొంతమంది సెక్యూరిటీని వివిధ మార్గాల ద్వారా తీసుకుంటున్నామని తెలిపారు. తద్వారా యాదగిరిగుట్ట కొండపైన నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయనున్నామని తెలిపారు. అదేవిధంగా స్వామివారిని దర్శించుకునే భక్తులకు వివిధ సేవల ద్వారా స్వామివారి కృపాకటాక్షాలు స్వామివారి ఆశీస్సులు పొందేందుకు తగిన విధంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందుకు భక్తుల స్థానికులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, డీఈఓ డి.భాస్కర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# నవభారత్‌లో క్యాంపస్ డ్రైవ్




భువనగిరి, మేజర్‌న్యూస్ : భువనగిరి పట్టణంలో గల శ్రీ నవభారత్ డిగ్రీ, పి.జి కళాశాల యందు శనివారం హెచ్,ఎఫ్‌టి టాటా స్ట్రైవ్ స్కిల్స్ నవభారత్ ఆధ్వ ర్యంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది. ఈ డ్రైవ్‌లో భువనగిరి పట్టణ పరిసర ప్రాంతాల నుండి దాదాపుగా 150 మంది అభ్యర్థులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సి. హెచ్.ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ ఇట్టి సువర్ణ అవకాశాన్ని అభ్యర్థులు వినియోగించుకొని ఉద్యోగాలను సాధించాలని సూచించారు. ఈ క్యాంపస్ డ్రైవ్‌లో హైదరాబాద్‌కు చెందిన టాటా స్ట్రైవ్, బజాజ్ క్యాపిటల్, ఐ ప్రొసెస్, అపోలో ఫార్మసి, టిక్స్ అకాడమీ కంపెనీ హెచ్‌ఆర్‌లు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 48 మంది అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి

### - ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



భువనగిరి రూరల్, మేజర్‌న్యూస్ : భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి భువనగిరి మండలంలోని అనంతారం, తాజ్‌పూర్, హన్మపురం, మన్నెవారిపంపు, వడపర్తి, బస్వపురం, ముత్తిరెడ్డిగూడెం, గంగసానిపల్లి గ్రామాలలో పర్యటించి హెచ్ ఎండీఏ నిధుల ద్వారా మంజూరైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని పథకాలు అమలవుతున్నాయని గత ప్రభుత్వంలో ఏ ఒక్కరికి రేషన్ కార్డు ఇయ్యలేదని త్వరలో ప్రతీ మండలంలో నూతన రేషన్ కార్డులు అందజేస్తామని అన్నారు. గతంలో ఎన్నడు లేని విదంగా హెచ్ఎండీఏ నిధులు తీసుకొచ్చి భువనగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్ చేస్తుందని అనడం పట్ల వారికి బుద్ధి లేదని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీకి ఎన్నికలలో ప్రజలు డిపాజిట్లు గల్లంతుచేసిన కేటీఆర్‌కు ఇంకా బుద్ధి రాలేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం భార్యాభర్తలు మాట్లాడుకున్న ఫోన్ కూడా ట్యాప్ చేశారని విమర్శించారు. సినిమా హీరోయిన్లు, రాజకీయ నాయకులు, రాజకీయ ప్రత్యర్థులవి, హైకోర్టు జడ్జిలవి కూడా ఫోన్ ట్యాపింగ్ చేశారని ఎమ్మెల్యే ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి సమస్య మీద స్పందిస్తుందని ఎమ్మెల్యే గుర్తు చేశారు.

# డిప్యూటి ట్రాన్స్పోర్ట్ కమీషనర్‌గా సురేష్ రెడ్డి

సూర్యాపేట కలెక్టరేట్, మేజర్‌న్యూస్ : సూర్యాపేట జిల్లా రవాణా అధికారిగా పనిచేస్తున్న సురేష్ రెడ్డి హనుమకొండకు డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమీషనర్‌గా పదోన్నతిపై శనివారం వెళ్ళారు. గతములో బాగా పనిచేశారని పేరు పొందారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆయన తనదైన ముద్రవేసుకున్నారు. ధాన్యం కొనుగోళ్ళలో రవాణా వేగవంతంగా జరగడానికి ఆయన కృషి చేశారు.

# లబ్ధిదారుల ఎంపికలో అర్హులైన పేదలకు తీరని అన్యాయం



మోత్కూర్, మేజర్‌న్యూస్ : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అర్హులైన పేదలకు తీరని అన్యాయం జరుగుతుందని సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకట నర్సు ఆరోపించారు. శనివారం పాలడుగు గ్రామంలో సిపిఎం గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట నర్సు మాట్లాడుతూ ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే ఇండ్లులేని పేదలందరికి ఇండ్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇందిరమ్మ కమిటీల పేరుతో తమ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఇండ్లను ఎంపిక చేసి అర్హులైన పేదలను విస్మరిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ గత ప్రభుత్వం అనుసరించిన విదానాలనే అమలు చేస్తుందని ఫలితంగా నాడు, నేడు కూడ అర్హులైన నిరుపేదలకు లబ్ది చేకూరడం లేదని వాపోయారు. లబ్ధిదారుల ఎంపిక గ్రామ సభల్లో ప్రజల సమక్షంలో అధికారులు చేయవలసి ఉన్నా, అందుకు భిన్నంగా అధికారంలో ఉన్న పార్టీ నాయకులు ఎంపిక చేయడంతో అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ఇప్పటికైనా పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలను గుర్తించి వారికి లబ్ది చేకూర్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. పిట్టల చంద్రయ్య అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో సిపిఎం మండల కమిటీసభ్యులు దడిపల్లి ప్రభాకర్, కొంపల్లి ముత్తమ్మ, వెండి యాదగిరి, చింతకింది సోమరాజు, దడిపల్లి సైదులు, వడ్డేపల్లి లక్ష్మణ్, కొంపల్లి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



మోత్కూర్, మేజర్‌న్యూస్ : మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని అన్నెపు వాడలో నిరుపేద కుటుంబానికి చెందిన బొల్లు లక్ష్మీ గుండెపోటుతో మృతిచెందగా ఆమె మృతదేహం పై కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి ఆర్థిక సాయం అందచేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు పల్లెర్ల వెంకన్న గుప్తా అందించిన 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని స్థానిక నాయకుల ద్వారా మృతురాలు కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ నాయకులు కారుపోతుల వెంకన్న గౌడ్, బొల్లేపల్లి శ్రవణ్, అన్నెపు సతీష్, సిపిఎం నాయకులు బొల్లు యాదగిరి, తెలకలపల్లి రాజు, తెలకలపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ లేక అవస్థలు



నేరేడుచర్ల,మేజర్‌న్యూస్ః మండలంలోని చిల్లేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సాంఘీక సంక్షేమ హస్టల్ వద్ద అక్కడ ఉన్న ఇండ్ల నుండి వస్తున్న వ్యర్థ జలాలతో రోడ్డు అంతా దుర్గంధభరింతగా, బురదమయంగా నిత్యం ప్రవహిస్తూ ప్రజలకు అసౌకర్యంగా ఉన్న అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని గ్రామప్రజలు ఆరోపిస్తున్నారు. సుమారు లక్ష రూపాయల పైనే ప్రతి ఏటా పన్నుల రూపంలో ఒక స్కూల్ భవనం నుంచే గ్రామపంచాయతీకి వస్తున్న ఈ ప్రాంత అభివృద్ధిలో గ్రామపంచాయతీ వైఖరి ఆరుణంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన పనులు చేపట్టి ప్రజలు రోగాల భారిన పడకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి అక్కడికక్కడే మృతి



చిట్యాల, మేజర్‌న్యూస్ : చిట్యాల మండల పరిధిలోని ఏపూర్ గ్రామములో గల డిఇసి కంపెనీలో కూలిపని నిమిత్తం మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అజిత్ బన్సాల్ కుటుంబ సభ్యులతో గత రెండు సంవత్సరముల నుండి కంపెనీ రూమ్‌లోనే ఉంటూ పనులకు వెళ్తున్నారు. శుక్రవారం వర్షం వస్తున్న సమయంలో తను నివాసం ఉంటున్న షెడ్ పక్కన ఉన్న ఇనుప రాడ్ ను పట్టుకోగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే చనిపోయినట్లుగా మృతుని భార్య రాధ భన్సాల్ ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.రవికుమార్ తెలిపారు.

## గ్రామాలలో కోతులు, కుక్కల బెడద నుండి ప్రజలను రక్షించాలి



దామరచర్ల, మేజర్‌న్యూస్ : పంచాయతీలో పక్కాగా మౌలిక సదుపాయాలు కల్పించాలని దామరచర్ల సిపిఐ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయ సూపర్డెంట్ అధికారికి వినతి పత్రం. దామరచర్ల మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాలలో కోతులు కుక్కలు బెడద పెరిగిపోయి ప్రజలకు మానప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని అలాగే మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని దామరచర్ల సిపిఐ అధికారి పోలేపల్లి ఉదయ్ కుమార్ ఆరోపించారు. శనివారం దామరచర్ల వ్యాప్తంగా ఉన్న గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయ అధికారి సూపరింటెండెంట్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ దామరచర్ల కార్యదర్శి జిల్లా కౌన్సిల్ సభ్యులు పోలేపల్లి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాలలో గత కొన్ని నెలల నుండి మిషన్ భగీరథ ట్యాంకులను పరిశుభ్రం చేయడం లేదని దామరచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉపకేంద్రంలో ఎల్లవేళలా వైద్యులు అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు.

## ఆలయంలో జోడు సేవ

యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. శనివారం కావడంతో అధిక సంఖ్యలో స్వామి వారి ఆలయానికి భక్తులు విచ్చేశారు. దీంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది. క్యూ లైన్లో భక్తులు బారులు తీరారు. ఉచిత ప్రవేశ దర్శనానికి దాదాపు రెండు గంటల సమయం,ప్రత్యేక ప్రవేశ దర్శనానికి దాదాపు గంట సమయం పడుతుంది. ఆర్జిత సేవలు, నిత్యా పూజల్లో పాల్గొని భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు. శనివారం వివిధ కైంకర్యాలలో వచ్చిన ఖజానా 31,88,975.



## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలి

### - కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు



మునుగోడు, మేజర్‌న్యూస్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలనీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు అన్నారు. శనివారం మండలంలోని కిష్టాపురం గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు వివిధ రకాల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా ఇంటివద్ద మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని అన్ని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్థలాల్లో మొక్కలు నాటాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోయ సురేష్, బోయ శ్రీను, నందిపాటి జలంధర్ ఉన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రానికి బీరువా

## కుక్కర్ బహూకరించిన మందుల బీరప్ప



మునుగోడు, మేజర్‌న్యూస్ : మండలంలోని కోరటికల్ గ్రామం అంగన్‌వాడి 3 కేంద్రమునకు శనివారం కాంగ్రెస్ మండల నాయకులు మందుల బీరప్ప మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్ఫూర్తితో బీరువా, కుక్కర్‌ను బహుకరించి మానవత్వం చాటుకన్నారు. ఈ సందర్భంగా బహుకరించిన దాత మందుల బీరప్పకు అంగన్వాడి కేంద్రం 3 సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే

మిర్యాలగూడ టౌన్, మేజర్‌న్యూస్ : వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలో గల ప్రసిద్ధ శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి వారి దేవాలయం కుటుంబ సమేతంగా దర్శించుకున్న శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి వారి ప్రథమ పుత్రుడు బత్తుల సాయి ప్రసన్న రెడ్డి వివాహ పత్రికను స్వామి వారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు, లక్ష్మీదేవిగూడెం గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్లను వీలైనంత త్వరగా గ్రౌండింగ్ చేయించాలి

### జెడ్పి సీఈఓ కే.శ్రీనివాస్ రావు



మునుగోడు, మేజర్‌న్యూస్ : ఇందిరమ్మ ఇళ్లను వీలైనంత త్వరగా గ్రౌండింగ్ చేయించాలనీ జెడ్పి సీఈఓ కే.శ్రీనివాస్ రావు అధికారులను ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో, ఎంపీఓ, ఏపీఓ, ఉపాధి హామీ సిబ్బందితో పలు అభివృద్ధి అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన టార్గెట్ ప్రకారం డ్రెయిన్ చివరలో, ఇనిస్ట్యూషనల్ సోప్ పీట్స్ వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలను పెంచి నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో మేకల విజయ భాస్కర్, మండల పంచాయతీ అధికారి మహ్మద్ అథర్ పర్వేజ్, ఏపీఓ ఇండ్ల నాగరాజు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ (ఈసి) జీడిమడ్ల మల్లేష్, మునుగోడు మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి పి.రాజశేఖర్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు నవనీత, అలివేలు కంప్యూటర్ ఆపరేటర్లు నరసింహ, జ్యోతిలు పాల్గొన్నారు.

## వింజమూరు విమలమ్మ హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం

### ప్రజల నుంచి అపూర్వ స్పందన

### బిజెపి జిల్లా నాయకులు గోపిడి అనిల్ రెడ్డి



చింతపల్లి, మేజర్‌న్యూస్ : చింతపల్లి మండలం పీకే మల్లేపల్లి గ్రామంలో శనివారం వింజమూరు విమలమ్మ హాస్పిటల్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మలక్పేట్ యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నల్లగొండ జిల్లా బిజెపి నాయకులు గోపిడి అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి పరీక్షలతో పాటు ఈసీజీ 2డి ఎకో, బి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వందలాది మంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు. యశోద హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అనిల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఫీల్డ్ అసిస్టెంట్‌ల వేతనాలు చెల్లించాలి

చిట్యాల, మేజర్‌న్యూస్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు గత నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదని శనివారం చిట్యాల ఎంపీడీవో ఎస్పీ జయలక్ష్మికి శనివారం ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ జిల్లా కార్యదర్శి చేకూరు మల్లేష్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ పోషణ చాలా ఇబ్బంది కరంగా ఉందని పిల్లల స్కూల్ ఫీజులు తదితర ఖర్చులకు భారం అవ్వడంతో బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు రమేష్, జోగు లింగస్వామి,నూనె శివ, వీరమల్ల ఉషారాణి, వడ్డగాని రాదా, స్వప్న, చాంద్ పాషా, మంజుల, అనిత, వరలక్ష్మి, శోభారాణి పాల్గొన్నారు.

# విద్యాలయంలో మౌళిక వసతులను ఏర్పాటు చేయాలి

## జిల్లా కలెక్టర్



సూర్యాపేట కలెక్టరేట్, మేజర్‌న్యూస్ ః జవహర్ నవోదయ విద్యాలయంలో మౌళిక వసతులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని రెడ్డి హాస్టల్ నందు ఏర్పాటు చేసిన జవహర్ నవోదయ విద్యాలయంను అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం నుండి జవహర్ నవోదయ విద్యాలయం ప్రారంభమవుతుంది కాబట్టి విద్యార్థుల కొరకు ఏర్పాటు చేసిన బెంచీలు, త్రాగునీరు కొరకు ఆర్వోప్లాంట్, వంట గది, వంట సామాగ్రి, డైనింగ్ హాల్, టాయిలెట్స్ అలాగే లైబ్రరీ కొరకు టేబుల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవరావు, డిఈఓ అశోక్, తహశీల్దార్ కృష్ణయ్య, నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్, తెలంగాణ రాష్ట్ర విద్యా, సంక్షేమ మౌళిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డిఈ రమేష్, ఏఈ ఒబుల్, అధికారులు పాల్గొన్నారు.

# భక్తులకు స్థానికులకు హెల్మెట్లు పంపిణీ



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : యాదగిరిగుట్ట దేవస్థానికి వచ్చే భక్తులకు, స్థానికులకు మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సైదాపురం గ్రామం మాజీ సర్పంచ్ బీర్ల శంకర్ ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలోని వైకుంఠ ద్వారం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఇది ఒక మంచి కార్యక్రమం అని అన్నారు. వాహనాలపై ప్రయాణించే భక్తులు, స్థానికులు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ ప్రమాదం జరగకుండా ప్రాణాలు పోకుండా హెల్మెట్ కాపాడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు తలకు హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని అన్నారు. అనంతరం సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉచిత హెల్మెట్ల దాత బీర్ల శంకర్ మాట్లాడుతూ తను స్వయంగా రోడ్డుపై ప్రయాణిస్తున్న సమయంలో కొందరు యువకులు రోడ్డు ప్రమాదంలో హెల్మెట్ ధరించకపోవడం వల్ల అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని ఈ సంఘటన చూసి చెల్లించి పోయానని అన్నారు. ఆ సంఘటన చూసినప్పటి నుండి ఉచితంగా హెల్మెట్లు అందజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని అన్నారు. ఆలేరు నియోజకవర్గంలోని ప్రతి స్టేషన్కు వంద హెల్మెట్ల చొప్పున ఉచితంగా అందజేయనుందామని అన్నారు. ట్రాఫిక్ పోలీసులు వీటిని బైక్ పై ప్రయాణిస్తూ హెల్మెట్ లేని వారికి ఉచితంగా అందజేస్తారని తెలిపారు. మునుముందు ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత పెద్ద ఎత్తున చేయనున్నామని ఆయన ప్రకటించారు. సేవా దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నానని తెలిపారు. బైక్ నడుపుతూ ప్రమాదాలకు గురైన సందర్భంలో హెల్మెట్ లేకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుందని అన్నారు. అలాంటి పరిస్థితి తలెత్తకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఈ హెల్మెట్లను కొంతమంది వాహనదారులకు పంపిణీ చేశారు. అనంతరం ట్రాఫిక్ పోలీసులకు పెద్ద ఎత్తున హెల్మెట్లను అందజేశారు. వారి ద్వారా హెల్మెట్ లేకుండా ప్రయాణించే వీరికి ఈ హెల్మెట్లను అందజేయనుందామని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, పోలీసు అధికారులు, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, స్థానిక నాయకులు మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, ముక్కెర్ల మల్లేష్ యాదవ్, బందారపు భిక్షపతి, హేమెంధర్ గౌడ్, గుండు నరసింహ గౌడ్ గుడ్ల నరేష్ కుమార్ పాల్గొన్నారు.

# నా అభివృద్ధికి తొలిమెట్టు జర్నలిజమే

## యాట సత్యనారాయణ రజాకార్ దర్శకుడు



చిట్యాల, మేజర్‌న్యూస్ : మారుమూల గ్రామంలో పుట్టి పెరిగి సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు పొందడానికి తొలిమెట్టుగా జర్నలిజమే కారణం అయిందని రజాకార్ చిత్ర దర్శకుడు, గద్దర్ పురస్కార గ్రహీత యాట సత్యనారాయణ అన్నారు. శనివారం చిట్యాల పట్టణ కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో టియుడబ్ల్యూజే (ఐజేయూ) చిట్యాల మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ముందుగా టియుడబ్ల్యూజె (ఐజేయూ) మండల శాఖ ఆధ్వర్యంలో ఆయనకు పూలమాలవేసి, శాలువా కప్పి జ్ఞాపికను ప్రధానం చేశారు. అనంతరం యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏళ్ల బయన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ బాల్యం నుండి ఎలాంటి ప్రోత్సాహం లేకుండా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని తాను ఈ స్థితికి వచ్చానన్నారు. సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందాలనే ఉద్దేశంతో జర్నలిస్టుగా పనిచేశానన్నారు. ఆ వృత్తిలో రాణించి సినీ రంగంలో రాణించాలని ఆలోచన ఆనాడే కలిగిందన్నారు. రజాకార్ సినిమా చిత్రీకరణకు ముందే సినిమా పరిశ్రమలోని ఎంతోమంది తనను బెదిరించినప్పటికీ మొక్కవోని లక్ష్యంతో అప్పటి తెలంగాణ ప్రజల చరిత్ర, జీవన విధానం అందరికీ తెలియాలనే ఉద్దేశంతో తాను రజాకర్ చిత్రాన్ని తీశానన్నారు. తాను తీసిన చిత్రానికి ఇంత ఆదరణ లభించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చే అవార్డు రావడం తెలంగాణ ప్రజల ఆశీస్సుల వల్లే సాధ్యం అయిందన్నారు. ఏ వ్యక్తి అయినా జీవితంలో రాణించాలంటే ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ లక్ష్య సాధనకు పట్టుదలతో నిరంతరం శ్రమిస్తే విజయం సాధ్యమవుతుందని, విద్యార్థులు కూడా బాల్యం నుండే ఉన్నత లక్ష్యాలను నిర్ణయించుకొని వాటి సాధన కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. భవిష్యత్తులో సమాజ శ్రేయస్సు కోసం మరిన్ని ఉత్తమ చిత్రాలు తీసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా కార్యదర్శి పెద్ది నరేందర్, మండల అధ్యక్షుడు మెండే వెంకన్న, ప్రధాన కార్యదర్శి పోకల కరుణాకర్, కోశాధికారి శ్రీనివాస్, గౌరవ సలహాదారుడు మిర్యాల ప్రకాష్, ఉపాధ్యక్షులు ఏళ్ల వెంకన్న, సహాయ కార్యదర్శి కూనూరు మధు, సభ్యులు జిట్టా మల్లేష్, అమరోజు వెంకన్న, మెహర్ బాబు, కాలిన శ్రీశైలం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ వాగ్దేవి పాఠశాలలో ఘనంగా బోనాల వేడుకలు




మిర్యాలగూడ టౌన్, మేజర్‌న్యూస్ : తెలంగాణ ప్రతీక బోనాల వేడుకలను మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురంలో గల శ్రీ వాగ్దేవి పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ సోమ గాని శ్రీను వాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు హాజరైనారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరుపుకునే ఒక ముఖ్యమైన పండుగ బోనాలు అని బోనాల పండుగను నిర్వహించడం ద్వారాప్రజలు తమ కుటుంబాలకు ఆరోగ్యం, ఐశ్వర్యం, శ్రేయస్సు కలగాలని కోరుకుంటారనీ, పిల్లకు మన సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన కలిగించేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు, తల్లిదండ్రులకు బోనాలు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం చిన్నారులకు డాన్స్ మాస్టర్ వెంకట్ సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారులు పోతరాజుల వేషాధారణతో అంగరంగ వైభవంగా కోలాహాలతో పాటశాల ఆవరణం కేరింతలతో ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎడవల్లి నాగరాజు, చీదెళ్ల మాణిక్యం టీచర్లు సుష్మ వాణి పద్మ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు చట్టాల పై అవగాహన కలిగి ఉండాలి

## జడ్జి కె.భవ్య



కోదాడ, మేజర్‌న్యూస్ : మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాల గురించి మహిళలు అవగాహన కలిగి ఉండాలని కోదాడ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భవ్య కోరారు. శనివారం కోదాడ కోర్టులో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ మహిళలు తమ హక్కుల కోసం, తమకు జరుగుతున్న అన్యాయాలపై చట్టాలను రక్షణగా ఉపయోగించుకొవాలన్నారు,మహిళలు గృహహింస కు గురైతే కోర్టులో కేసు వేసుకోవచ్చున్నారు. గృహహింస కేసులో మహిళలకు షెల్టర్, నష్టపరిహారం, భరణం,స్త్రీ ధనం తిరిగి ఇవ్వడం కోసం చట్టం పని చేస్తుందన్నారు. మొదటి అదనపు జడ్జి ఎండీ.ఉమర్ మాట్లాడుతూ భారతీయ కుటుంబ వ్యవస్థ బలమైనదని, దాన్ని కాపాడుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. వివాహాలు, కుటుంబం, సంసారాల్లో మూడవ వ్యక్తి ప్రమేయం వలన గొడవలు వస్తాయని,వాటి వలన కోర్టు వరకు రావాల్సి వస్తుందన్నారు. రెండవ అదనపు జడ్జి జకీయా సుల్తానా మాట్లాడుతూ గృహహింస చట్టంలో భాగంగా కుటుంబం నుండి వేరుగా వేరే ప్రాంతంలో నివసించే వారిపై కేసులు పెట్టడం తగదన్నారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఉయ్యాల నర్సయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయవాదులు యడ్లపల్లి వెంకటేశ్వరరావు, గట్ల నర్సింహారావు, మంద వెంకటేశ్వర్లు, సామ నవీన్ కుమార్, కె.శరత్ కుమార్, ఆవుల మల్లిఖార్జున్, పారాలీగల్ వాలంటీర్లు, మండల లీగల్ సర్వీస్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

## మున్సిపల్ కార్మికుల సమావేశంలో డబ్బికార్

మిర్యాలగూడ టౌన్, మేజర్‌న్యూస్ : కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డబ్బికార్ మల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల చేత అధికారులు వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని, రోజుకు 10 గంటల పని విధానాన్ని అమలు చేసి శ్రమదోపిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అందడం లేదని వాపోయారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందడం లేదని, కనీసం దహన ఖర్చులు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. కార్మికులు చనిపోతే దహన ఖర్చుల కింద 20 వేలు ఇవ్వాలని కోరారు. పిఎఫ్ ఈఎస్ఐ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. ప్రతి ఆదివారం కార్మికులకు సెలవు ఇవ్వాలని కోరారు. కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉండి ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు అమలు చేస్తే కార్మిక వ్యతిరేక విధానాలను ఉద్యమాల ద్వారా తిప్పి కొట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం సి పి ఐ యు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వస్కుల మట్టయ్య, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి డా.మల్లు గౌతమ్ రెడ్డి, కార్మికుల సంఘాల నాయకులు చిలుముల వెంకన్న, మోహన్, వెంకన్న, ఈశ్వరమ్మ, డి.మోహన్, లింగయ్య, కళావతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



# పచ్చదనమే లక్ష్యంగా..మొక్కలు సిద్ధం

## మండల వ్యాప్తంగా నిర్దేశిత లక్ష్యం 73,450..

## కనగల్ వననర్సరీలో 15వేల మొక్కలు సిద్ధం..


వేంరెడ్డిగూడేంలో మొక్కలను నాటేందుకు గుంతలు తీస్తున్న ఉపాధీ కూలీలు


కనగల్ వనర్సరీలో నాటడానికి మొక్కలు సిద్ధంగా ఉన్న మొక్కలు

కనగల్,మేజర్‌న్యూస్‌: మండలవ్యాప్తంగా పచ్చదనాన్ని పెంచేందుకు ప్రతి ప్రదేశంలో మొక్కలను నాటాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ నెలలో చేపడుతున్న వనమహోత్సవంకు మండల అధికారులు సర్వసిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే 31 వననర్సరీలలో 2లక్షల పై చిలుకు మొక్కలను పెంచుతుండగా అందులో ప్రభుత్వం మండల వ్యాప్తంగా సుమారు 73,450 మొక్కలను నిర్దేశిత లక్ష్యంగా పెట్టుకున్నారు.మొక్కలను నాటేందుకు వర్షాలు సమృద్ధిగా కురుస్తున్న ప్రాంతాలలో,ప్రభుత్వ స్థలాలో, రోడ్లుకు ఇరువైపుల ఉన్న ఖాళీ స్థలలాను గుర్తించి గుంతలు తీయడంలో అధికారులు సమయాతం అయ్యారు.అధికారులు ఇటు ప్రజాప్రతినిధులను ఏకం చేస్తు గ్రామాల్లోని ప్రజలకు, రైతులకు అవగాహన కల్పిస్తు ఇంటింటికి 6 మొక్కలను పంపిణీ చేయడంలో ఆయా గ్రామపంచాయితీల కార్యదర్శులు నిమగ్నమైయ్యారు.మొక్కలను మండల వ్యాప్తంగా పెంచేందుకు గ్రామీనాభివృద్ధిశాఖ,ఉపాధిహామి సిబ్బందితో సమైఖ్యంగా సమృద్ధిగా పెంచారు.వర్షాలు సమృద్ధిగా కురిసిన ప్రాంతాలను మొదటగా ఎంచుకుని నిర్దేశిత లక్ష్యంను చేరేందుక మండల అధికారులు సంసిద్దులు అవుతున్నారు.ఇదిలా ఉంటే కనగల్ గ్రామపంచాయితీ పరిధిలో ఉన్న చెల్లాయిగూడేం గ్రామంలో ఏర్పాటు చేసిన వననర్సరీలో మొక్కలు సుమారుగా 15వేలకు పైగా పెంచారు. అందులో 11వేలకు పైగా మొక్కలను నాటాలన్న లక్ష్యాన్ని ఎంచుకున్నారు. ఇప్పటికే కనగల్ గ్రామపంచాయితీ పరిధిలోగల ఖాళీ స్ధలాలను,ప్రభుత్వ స్ధలాలను,రోడ్లుకు ఇరువైపుల ఉన్న ఖాళీ స్ధలాలను గుర్తించి గుంతలు తీస్తు ఇంటింటికి మొక్కలను పంపణీ చేయడంలో జీపీ కార్మికులు ముందున్నారు.



**సుధాకర్..ఏపీవో సుధాకర్**

నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎన్ఆర్ఈజీఎస్, గ్రామీణాభివృద్ధిశాఖ వారి సమక్షంలో మొక్కలను మండల వ్యాప్తంగా 74వేల పై చిలుకు మొక్కలను నాటేందుకు ఎంచుకున్నాం..31 జీపిలలో నర్సరీల ద్వార మొక్కలను 2లక్షల పై చిలుకు పెంచాం.. వాటి ఖాళీ స్థలాలో,ఇంటింటికి ఆరు మొక్కల చోప్పున పంపిణీ చేసి నాటుతాం..లక్ష్యాన్ని అదిగమిస్తాం..

### అంగరంగ వైభవంగా

# శ్రీ వెంకటేశ్వర స్వామి వారి నిత్య కళ్యాణోత్సవం

**భువనగిరి జిల్లా బ్యూరో**



అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతః కాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించడం జరిగింది. సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించడం జరిగింది. 5:45 నిమిషాలకు శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్ఛారణలతో సువర్ణ బిందె తీర్ధమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. ఉదయం 6 గంటలకు అలంకార ప్రియుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అర్చక స్వాములు మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య సుగంధ భరితమైన పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వర్ణగిరి క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్యక్షేత్రంలో శ్రీ అష్టలక్ష్మి మండపంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పంచామృతములు, పసుపు, సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రోచ్ఛారణలతో వసంతోత్సవ సేవను శోభాయ మానంగా నిర్వహించడం జరిగింది. అనంతరం అర్చక స్వాములు కర్పూర మంగళహారతులు సమర్పించారు. ఉదయం 10:30లకు విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 4000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 6:30కు ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్ఛారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు. భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు. స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో శనివారం సందర్భంగా జల నారాయణ స్వామి వారికి మంగళహారతులు సమర్పించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు.

# మార్నింగ్ వాక్‌లో పాల్గొన్న ప్రభుత్వ విప్"



ఆత్మకూర్(ఎం), మేజర్‌న్యూస్ : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి శనివారం పత్రిక సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు అభివృద్ధి పనుల పురోగతి, లబ్ధిదారులను మార్నింగ్ వాక్‌లో వివరాలను అడిగి తెలుసుకోవడానికి ఆదివారం ఉదయం 5-30 ఆత్మకూరుకు వస్తున్నారని తెలిపారు మండల కాంగ్రెస్ పార్టీ తాజా మాజీ ప్రజా ప్రతినిధులు మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, డైరెక్టర్‌లు పాల సంఘం చైర్మన్‌లు డైరెక్టర్లు దేవాలయ చైర్మన్‌లు డైరెక్టర్లు మార్కెట్ డైరెక్టర్లు, అన్ని గ్రామాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, బూత్, అనుబంధ సంఘాలు బీసీ, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సెల్, కార్మిక సంఘాల, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అభిమానులు, కార్యకర్తలు సకాలంలో హాజరుకావాలని కోరారు.

## నకిరేకల్ ఏరియా ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తిచేసి

# త్వరలో వైద్య సేవలు అందించాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నల్గొండ జిల్లా బ్యూరో**



నవంబర్ నాటికి నకిరేకల్ నూతన ఏరియా ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తిచేసి వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వైద్యాధికారులను, సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం ఆమె నల్గొండ జిల్లా, నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రి నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్, వైద్యాధికారి శోభారాణితో మాట్లాడుతూ త్వరితగతిన ఆసుపత్రి నిర్మాణ పనులను పూర్తి చేయాలని, నవంబర్‌లోగా నిర్మాణం పూర్తయితే నవంబర్ నుండి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రస్తుత ఆస్పత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవలు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నల్గొండ ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, ఆసుపత్రి వైద్యులు, అనస్తీసియా డాక్టర్, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# రామాజీపేట గ్రామంలో నోట్ బుక్స్ పంపిణీ

యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : ఆలేరు మాజీ శాసనసభ్యులు బూడిద బిక్షమయ్య గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. శనివారం రామజీపేట గ్రామంలో ఆలేరు మాజీ ఎమ్మెల్యే బిక్షమన్నా పుట్టినరోజు సందర్భంగా రామజీపేట స్కూల్లో అడ్వాన్స్‌గా పుట్టినరోజు వేడుకలు నిర్వహించి, స్కూల్ పిల్లలకు ఐడి కార్డ్స్, షూస్, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఇట్టి కార్యక్రమంలో లిసాయి సత్య సోమా ట్రస్టు డైరెక్టర్ కొల కళ్యాణి మహేష్ గౌడ్, ప్రిన్సిపాల్ మాజీ సర్పంచ్ మొగిలిపాక తిరుమల రమేష్, స్కూల్ చైర్మన్ వాణి, నామిలే శ్రీశైలం, కె.శ్రీశైలం, ఐలయ్య, రఘుపతి రెడ్డి అనురాధ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



# స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు



యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : శనివారం శ్రీ స్వామి వారిని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు. వారి వెంట మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ మనవడు సర్వేపల్లి వెంకటేశ్వర రావు దర్శనార్థం విచ్చేశారు. వీరికి ఎస్.వెంకట్రావ్ ఐఏఎస్ కార్యనిర్వాహణాధికారి వారి ఆధ్వర్యములో దర్శన, ఆశీర్వచన ఏర్పాట్లు చేశారు. వీరికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి వేదమండపంలో, వేద పండితులు, వేద ఆశీర్వచనం చేసి అక్షింతలు అందజేయగా ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదం అందజేశారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం

## తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్



అడ్డగూడూర్ మేజర్ న్యూస్ ః యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూర్ మండల కేంద్రంలో అర్హులైన ప్రతి నిరుపేదలకు అందరికి దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. ఎంపిడిఓ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ శనివారం అడ్డగూడూర్‌లో 34 మందికి, చిన్నపడిశాల 11 మందికి మొత్తం 45 మంది లబ్ధిధారులలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్నారు. తుంగతుర్తి నియోజకవర్గానికి మరో 1500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసే బాధ్యత తనదన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో దళిత బంధు అమలైన లబ్ధిదారులందరికి దళిత బందునపు ఇవ్వాలని ఎమ్మెల్యే మందుల సామెల్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని దళిత బంధు వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శంకరయ్య, ఎంపిఓ ప్రేమలత, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మనగోటి జోజి, మోత్కూర్ మార్కెట్ వైస్ చైర్మెన్ లింగాల నర్సిరెడ్డి, సింగిల్ విండో చైర్మెన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, ఇటికాల చిరంజీవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బాలెంల సైదులు, పూజారి నర్సయ్య గౌడ్, పూలపెల్లి సోమిరెడ్డి, బొమ్మగాని లక్ష్మయ్య, గోలి రాంరెడ్డి, కేసారం శ్రీనివాస్‌రెడ్డి, తీగల గోవర్ధన్‌రెడ్డి, బాలెంల సురేష్, ఉడప్పు వెంకన్న, ఇందిరమ్మ లబ్దిదారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధి పనులు, మహిళా సంఘాల చేయూత పై పరిశీలన

నూతనకల్, మేజర్‌న్యూస్ : మండల పరిధిలోని పెదనెమిల గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను, గ్రామంలో గల మహిళ పొదుపు సంఘాల వివరాలను, మహిళా అభివృద్ధికై ప్రభుత్వం అందిస్తున్న రుణాలపై మహిళలు పొందుతున్న ఉపాధిపై కేంద్ర ఉపాధి పనుల మానిటరింగ్ కమిటీ సభ్యులు సలీం కుమార్, సలేమూన్‌లు శనివారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులను పరిశీలించారు. మహిళలను వారు పొందుతున్న ఉపాధిని,ఆర్థికంగా జరుగుతున్న అభివృద్ధిని గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల అభివృద్ధి అధికారి సునీత గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడుతూ విద్యార్థులకు మేను ప్రకారం నాన్యమైన,పౌష్టిక భోజనాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శశికళ, ఏపీఓ శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శులు ఉమేష్, రమేష్, వెంకన్న, శ్రీనాథ్, వినోద, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎస్‌సి, త్రిబుల్ ఐటీలో ప్రతిభ కనబర్చిన పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం



కోదాడ, మేజర్‌న్యూస్ : కోదాడ కాకతీయ కమ్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గత ఎస్ఎస్ సి పరీక్షలలో జిల్లా ప్రథమ ర్యాంకు సాధించి, ట్రిపుల్ ఐటీ సీట్లు పొందిన తాళ్లూరి రేఖ శ్రీ కి 5,000 రూపాయలు, అలాగే త్రిబుల్ ఐటీ సీటు సాధించిన నరేంద్రకు 5,000 రూపాయలు చొప్పున మొత్తం పదివేల రూపాయలను ఆ సంఘం అధ్యక్షులు మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నం బాబు శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో నగదు బహుమతిని అందజేశారు. జిల్లాస్థాయి ర్యాంకు, ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించటం కోసం కృషి చేసిన ఉపాధ్యాయ సిబ్బందిని సంఘ నాయకులు అభినందించారు. భవిష్యత్తులో వివిధ రంగాల్లో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని సంఘ నాయకులు తెలిపారు. ఈ "అభినందన సభ,, కార్యక్రమంలో ఎంఈఓ సలీం షరీఫ్, కాకతీయ సంక్షేమ సంఘం సభ్యులు ముత్తవరపు రామారావు, నల్లజాల శ్రీనివాస రావు, సాదినేని అప్పారావు, మల్లెల పుల్లయ్య, సాతులూరు హనుమంతరావు, రావెళ్ళ కృష్ణారావు, వేమూరు విద్యాసాగర్, లైటింగ్ ప్రసాద్, రామయ్య, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు డి.మార్కండేయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యువ మాజీ సర్పంచ్‌కే మళ్ళీ అవకాశం

## ప్రజల్లో అభిమానం చూరగొన్న నాయకుడు...

## మాజీకే మా ఓటు అంటున్న బొల్లారం ఓటర్లు

గుర్రంపోడ్, మేజర్‌న్యూస్ : ఐదేళ్ళ ప్రజా సేవ, ప్రజల్లో ఆయనపై అభిమానం మళ్ళీ ఆయనే మాకు సర్పంచ్ కావాలంటున్న ప్రజలు. ఇదంతా ఎక్కడో కాదు నల్గొండ జిల్లా గుర్రంపోడ్ మండలం బొల్లారం గ్రామ మాజీ సర్పంచ్ కామల్ల నర్సింహా తీరు. ఆయనపై నమ్మకంతో ప్రజలు ఓటేసి గెలిపించారు. గెలిచిన తర్వాత అదే రీతిన ప్రతి కుటుంబానికి ఏదో రకంగా సేవ చేసాడు. ఒక దళిత బిడ్డగా ప్రజలు అవకాశం ఇస్తే అంతే స్థాయిలో ప్రజలతో మమేకపై ఐదేళ్ళు సేవ చేసాడు. తను తన గ్రామంపై ప్రేమతో యువకుల సాయంతో చేయాల్సిన అభివృద్ధి చేసి చూపించాడు.బిఆరెస్ పార్టీ అధికారంలో లేకపోయినా ప్రజలు ఆయన్ని గెలిపించేందుకు సిద్ధం అయ్యారు. అభివృద్ధి చేస్తే ప్రజలు ఆదరిస్తాడని చెప్పడానికి ఆయనే నిదర్శనమని చెప్పొచ్చు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు మళ్ళీ ఆయన్ని గెలిపించాలని కోరుకుందాం.

# దేశభవిష్యత్తు నిర్మాణంలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలి

## - ఎండిఆర్ విద్యాసంస్థల చైర్మన్ మేరెడ్డి దామోదర్‌రెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్,మేజర్‌న్యూస్ః దేశ భవిష్యత్తు నిర్మాణంలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని ఎండిఆర్ విద్యాసంస్థల చైర్మన్ మేరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు.శనివారం స్థానిక ఎండిఆర్ హైస్కూల్ నందు స్టూడెంట్ క్యాబినెట్ ఎన్నికలు నిర్వహించారు.దీనిలో భాగంగా 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఓటర్లుగా పాల్గొనగా, పోటీచేసే అభ్యర్థులు 8వ తరగతి నుండి 10 తరగతి విద్యార్థులను ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని,మన దేశం ఎన్నికల ద్వారా ప్రజాస్వామ్యం ద్వారా పరిపాలించబడు తుందన్నారు.పాఠశాల ప్రిన్సిపల్ నలబోలు భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పాఠశాల నందు స్టూడెంట్ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, దేశ నిర్మాణంలో తమవంతు పాత్ర పోషించే విధంగా తయారు చేయడం పాఠశాల బాధ్యతగా స్వీకరిస్తామని ఆయన అన్నారు.ఏవో నర్సిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సర్వతోముఖావృద్ధి సాధించాలని పేర్కొన్నారు. స్టూడెంట్స్ ఎన్నికల్లో భాగంగా రిటర్నింగ్ ఆఫీసర్‌గా ప్రిన్సిపల్ భూపాల్‌రెడ్డి ,ప్రీసైడింగ్ అధికారిగా బానోతు రమేష్ వ్యవహరించారు.కార్యక్ర మంలో మండల నోడల్ ఆఫీసర్ బీరెల్లి శ్రీనివాసరెడ్డి, ఎన్నికల అధికారులుగా వెంకట్‌రెడ్డి, శ్రీను, నరసింహారావు, కృష్ణ,చినబాబు,భద్రాద్రి బాబు,మొయిన్,సైదులు,మమత, సారిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చిర్రగూడూరులో ఇసుక డంపు సీజ్



అడ్డగూడూర్ ః మేజర్ న్యూస్ యాదాద్రి భునగిరి జిల్లా అడ్డగూడూరు మండల పరిదిలో చిర్రగూడూరు బిక్కేరు వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా 24 టన్నుల ఇసుక డంపు చేసిన వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు అడ్డగూడూరు ఎస్సై వెంకట రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని చిర్రగూడూరు గ్రామం బిక్కేరు వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా 24 టన్నుల ఇసుకను డంపు చేసి చుట్టు ప్రక్కల గ్రామాలకు తరలిస్తున్నారని సమాచారం మేరకు అడ్డగూడూరు పోలీసులు చిర్రగూడూరు గ్రామానికి వెళ్లి విచారించాగా గురువారం 8 గంటల సమయంలో చిర్రగూడూరు గ్రామానికి చెందిన కూటికంటి రమేష్ ఇంటి వద్ద డంపు చేసి, చుట్టుప్రక్కల గ్రామాలకు డంపు చేసిన ఇసుకను తరలిస్తున్న చిర్రగూడూరు గ్రామానికి చెందిన బండి సాయి కూమార్ తండ్రి వెంకన్న (25) అనే వ్యక్తిని అదుపులోనికి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చి సుమోటో కేసు నమోదు చేసినట్లు అడ్డగూడూరు ఎస్సై వెంకట్ రెడ్డి తెలిపారు.

# బంగారు భవిష్యత్తు కోసం విద్యార్థినులు లక్ష్యాలను ఎంచుకోవాలి

మేళ్లచెర్వు,మేజర్‌న్యూస్ః పాఠశాల స్థాయి నుండే విద్యార్థినులు బంగారు భవిష్యత్తు కోసం ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని వ్యక్తివికాస నిపుణులు పవన్, ఉదయశ్రీలు అన్నారు.శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నందు విద్యార్థినులకు భవిష్యత్తు నిర్మాణం , వ్యకత్వ వికాసం,భావోద్వేగాలు ఎలా తట్టుకోవాలి, వాటిని అధిగమించడం వంటి అంశాలపై వారు అవగాహ న కల్పించారు. విద్యార్థినులకు ధైర్యం, ఆత్మగౌరవం ఎంతో అవసరమన్నారు. విద్యార్థినులు ఇష్టపడి తమ లక్ష్యాలవైపు ముందుకు పయనించాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చి సమాజం గర్వించే విధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటరెడ్డి, ప్రత్యేక అధికారి హరిత, ఉపాధ్యాయనీలు మల్లీశ్వరీ,విజయ, ఉష, లక్ష్మీరాజ్యం, సైదమ్మ, సుజాత,వసంత పాల్గొన్నారు.

# బిక్షపతిని పరామర్శించిన రాష్ట్ర నాయకులు

మోటకొండూర్, మేజర్‌న్యూస్ ః కాంగ్రెస్ మండల పార్టీ మాజీ ఉపాధ్యక్షులు బొడిగె బిక్షపతి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు యెల్లంల సంజీవరెడ్డి పరామర్శించారు. శనివారం మూత్తిరెడ్డి గ్రామంలోని బిక్షపతి నివాసానికి సంజీవరెడ్డి వెళ్ళి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి సేవ చేసిన వారిని ఎప్పటికి మర్చిపోని సంస్కృతి కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు నూనెమూతల సంతోష్, సీనియర్ నాయకులు చాడ శశిధర్ రెడ్డి, ఒర్సు యాదగిరి, పంతుల భూపాల్, మాజీ ఎంపిపి వెంకటేశ్వర్లు, గ్రామ శాఖ ఉపాధ్యక్షులు రాజబోయిన రంజిత్, యాదాద్రి భువనగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ సెక్రటరీ ఏకు సంతోష్‌రెడ్డి, కళ్ళెం నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

నేరేడుచర్ల,మేజర్‌న్యూస్ః కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బిఆర్ఎస్ నియోజక వర్గ నాయకులు రాపోలు నవీన్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు.శనివారం మండలంలోని దిర్శించర్ల గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారులైన కలవకుంట్ల సైదమ్మ అనే మహి ళను ఆయన కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు ఎంపిక లబ్ధిదారుల అకౌంట్లో ప్రభుత్వం వెంటనే వారి అకౌంట్లలో డబ్బులు వేసి ఆదుకోవాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనలో పూర్తిగా విఫమైలందన్నారు.కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ నాగుల్‌మీరా, కల్వకుంట్ల సైదులు, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

# ఘనంగా బోనాల పండుగ




హాలియా, మేజర్‌న్యూస్ : హాలియా పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో శనివారం బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బోనాలతో అమ్మవారికి ప్రసాదం నివేదించారు. విద్యార్థులు పోతురాజు వేషధారణతో అలరించడంతోపాటు బోనాల పండగ విశిష్టతను తెలిపే పాటలతో నృత్యాలు చేసి అలరించారు. అనంతరం పాఠశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ఎస్కే.యాస్మిన్ మాట్లాడుతూ తెలంగాణ సాంప్రదాయమైన బోనాల పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. సాంప్రదాయ పండుగలను గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో చాపల నరేందర్ ఉపాధ్యాయులు జయంత్, నరేష్, సాయి రామ్, దేవేందర్, శ్రీలక్ష్మి, మౌనిక, రమాదేవి, సునీత, తస్లీమ్, శైలజ, రత్న కుమారి, నజియా పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# ముఖ్య కార్యకర్తల సమావేశం

## ముఖ్య అతిథిగా పాల్గొన్న యడవల్లి విజయేందర్ రెడ్డి



హాలియా, మేజర్‌న్యూస్ : హామీలను అమలు పరచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయింది. ముఖ్యఅతిథి విజేందర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలి,అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అయిందని అన్నారు. అనుముల మండలం కొట్టాల, చెల్మారెడ్డిగూడెం, హాజరిగూడెం, గ్రామాల నాయకులు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకంటే ముందు ఆరు గ్యారంటీలు,420 హామీలను అమలు పరచడంలో విఫలం అయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలో ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకుందన్నారు. ప్రజా,రైతు సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని అన్నారు.గ్రామాలలో స్థానిక ఎన్నికల కోసమే అరకొరగా రైతుల ఖాతాలలో రైతు భరోసా డబ్బులు జమ చేశారని అన్నారు. గ్రామాలలో బిఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉండి కాపాడుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు అధ్యక్ష్యతన జరిగిన సమావేశంలో, కొత్తపల్లి మాజీ ఎంపీటీసీ ఊర్లుగొండ, వెంకటయ్య, చేగొండి కృష్ణ, బొమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, దుండిగల్ వెంకటేశ్వర్లు, గ్రామ శాఖ అధ్యక్షులు దుండిగల్ నరసింహ, వాహబ్, వీర్రాజు, దుబ్బ శివాజీ, నాగరాజు, తోకల అంజయ్య,గురజాల సైదులు, మౌలానా, రేఖ శ్రీనివాస్ జానపాటి భాస్కర్ రవి, పిచ్చయ్య, వంశీ, వెంకటయ్య మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంస్కృతి సాంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

హుజూర్‌నగర్ రూరల్, మేజర్‌న్యూస్ ః ఆన వాయితీగా వస్తున్న సంస్కృతి సాంప్రదాయాలను విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పాఠశాలలో అన్ని పర్వదినాలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ పోసాని వెంకట రమణరావు అన్నారు. శనివారం స్థానిక శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో ముందస్తుగా బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ రకాల అలంకరణలతో అందరిని అలంరించి బోనాలతో వచ్చి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో పిపిటి ఇంచార్జి సంధ్య, ఉపాధ్యాయ మమత,నందిని, శ్రీకళ,లక్ష్మి,నాగకన్య పాల్గొన్నారు.

# డివైఎఫ్ఐ యువ చైతన్య సైకిల్ యాత్రను జయప్రదం చేయండి

చిట్యాల, మేజర్‌న్యూస్ : భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డ్రగ్స్, గంజాయి, బెట్టింగ్, లోన్ యాప్‌లను అరికట్టాలని జులై 24 నకరేకల్‌లో ప్రారంభమై ఆగస్టు 02న మిర్యాలగూడ వరకు జరిగే సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ పిలుపునిచ్చారు. శనివారం నాడు సైకిల్ యాత్ర సంబంధించిన కరపత్రాలను చిట్యాల మండలంలోని వెలిమినేడు గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతీ, యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహిస్తూ దేశంలోనే అతిపెద్ద యువజన సంఘంగా ఉందన్నారు. అట్లాంటి డివైఎఫ్ఐ నేడు యువతను పట్టిపీడిస్తున్న బానిసలుగా చేస్తున్న గంజాయి, డ్రగ్స్, ఆన్లైన్ బెట్టింగ్ యాప్ లను అరికట్టి యువతను చైతన్యం చేయడానికి సైకిల్ యాత్ర నిర్వహించడం జరుగుతుందని అన్నారు. దేశంలో యువత నేడు పలు రకాల వ్యసనాలకు బానిసలు అవుతు సంఘ విద్రోహ శక్తులుగా మారుతున్నారని అన్నారు. యువతలో మార్పు తీసుకురావడం కోసం ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి వడ్డగాని మహేష్, మండల ఉపధ్యక్షులు కునూరు గణేష్, నాయకులు బొడ్డుపల్లి శ్రీను, గోలి సాయి కిరణ్, మేడి మనోజ్, నూతనకంటి లింగస్వామి, అరూరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం చేసిన బాల్యమిత్రులు




పెన్‌పహాడ్, మేజర్‌న్యూస్ : మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామంలో కొన్ని రోజుల రోజుల క్రితం దొంతగాని నాగయ్య (మీనాస్) విద్యుత్ షాక్‌తో అకాల మరణం చెందిన విషయం తెలుసుకున్న అతని బాల్యమిత్రులు నాగయ్య కుటుంబానికి శనివారం కుటుంబ సభ్యులకు 28,300 రూపాయలు అతని భార్య వెంకటమ్మకు అందజేసారు. ఆర్థిక సహాయం అందజేసిన వాళ్లలో కొండ జానకిరాములు గౌడ్, ఏపూరి నగేష్, దొంత గాని సైదులు, చెరుకుపల్లి వెంకన్న, డ్రైవర్ సైదులు, మేడం వెంకన్న, మేకల అంతయ్య, బుగ్గారపు అశోక్, బంటు సైదులు, డి.మంగమ్మ, ఎండి అమీనా, నకిరేకంటి సుశీల, సిహెచ్ సైదమ్మ, శిరీష, నిమ్మల ప్రభాకర్, వీరస్వామి, లక్ష్మి నారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో

# రికార్డులు పరిశీలించిన సబ్ కలెక్టర్ నారాయణ అమిత్

మిర్యాలగూడ టౌన్, మేజర్‌న్యూస్ : శనివారం సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ మిర్యాలగూడ పట్టణ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పరిశీలించడం జరిగింది. కార్యాలయము నందు గల రికార్డులను తనిఖీ చేయడం జరిగింది. మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్ చేయుట కొరకు సంబంధిత శాఖ నుండి ఎన్ఓసి తీసుకోవాలని ఆదేశించడం జరిగింది. అలాగే రిజిస్ట్రేషన్ కొరకు కార్యాలయానికి వచ్చే ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దని సిబ్బందికి సూచించడం జరిగింది.



# చలో హైదరాబాద్

## ఎరుకల హక్కుల పోరాట సమితి 29వ దినోత్సవం జయప్రదం చేయండి

మిర్యాలగూడ టౌన్, మేజర్‌న్యూస్ : ఆగస్టు 3న హైదరాబాద్ బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తలపెట్టిన ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి 29 ఆవిర్భావ దినోత్సవ సభకు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు. వజ్జగిరి అంజయ్య పిలుపునిచ్చారు. నల్గొండ జిల్లా జనరల్ బాడీ సమావేశం మిర్యాలగూడలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు వందలాదిమంది ఎరుకల బిడ్డలు తరలిరావాలని భూమి పై పుట్టిన మొట్టమొదటి ఆదివాసి బిడ్డలని భూమి పుత్రులమని పేర్కొంటూ... ఈ వేడుకను విజయవంతం చేయాలని కోరారు రాష్ట్రంలో మూడు లక్షల పైగా ఉన్న ఆదివాసులు ఎరుకల ప్రజల ఇబ్బందులను గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసి ఎరుకల హక్కుల సాధించుకోవడం కోసం ఈ వేడుకకు రాష్ట్ర నలుమూలల నుంచి ఎరుకల సోదరులు సోదరీమణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా ఈ కరపత్రాన్ని ఆవిష్కరించరు సమావేశంలో పోల వెంకటేశ్వర్లు, ఉదరగిరి, వెంకన్న,కంజల రవికుమార్, వజ్జగిరి కళ్యాణ్, కాండ్యల కలిస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

## మాజీ సర్పంచ్ బండి కృష్ణ గౌడ్




భూదాన్‌పోచంపల్లి, మేజర్‌న్యూస్ : విద్యార్థులు ఉత్తమమైన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఇంద్రియాల గ్రామ మాజీ సర్పంచ్ బండి కృష్ణ గౌడ్ అన్నారు. శనివారము భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని ఇంద్రియాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి 2024-2025 సంవత్సరం ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులకు బండి దయాకర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులతో పాటు నగదు పురస్కారాన్ని మాజీ సర్పంచ్ బండి కృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి విద్యార్థులను ప్రోత్సాహస్తున్నాం అని అన్నారు. విద్యార్థులు కష్టపడి ఇష్టపడి విద్యను అభ్యసించి భవిష్యత్ లో ఉన్నతమైన స్థాయికి వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాలు గురునాథం ,గ్రామ పెద్దలు పబ్బు యాదయ్య, గరిశే జంగయ్య, చింతల రామకృష్ణ,ధీరవత్ వెంకటేష్, ఉడుతల వాసుదేవ్, ఎర్ర లక్ష్మణ్, ఉపాధ్యాయులు హనుమంత్ రెడ్డి, వందన తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత పై

# హాస్టల్ విద్యార్థులకు అవగాహన

నూతనకల్, మేజర్‌న్యూస్ : మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతిగృహం, బాలుర వసతిగృహం, ఎస్సీ బాలుర వసతి గృహంల యందు మండల ఆరోగ్యశాఖ అధికారులు వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత పై శనివారం విద్యార్థులకు సిహెచ్ఓ చరణ్ నాయక్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో వర్షాలు పడడం వలన మన ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండడం వలన దోమలు స్థావరాన్ని ఏర్పాటు చేసుకుని ఉండి అవి కుట్టడం వలన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు సంభవిస్తాయని, అవి ఒకరి నుండి మరొకరికి కుట్టడం ద్వారా వ్యాపింపజేస్తాయని, వర్షాకాలంలో నీరు కలుషితం కావడం వలన, కలుషితమైన ఆహార పదార్థాలు ఈగలు వాలిన ఆహార పదార్థాలు తినడం వలన విరోచనాలు, బంక విరోచనాలు, కలరా వంటి రోగాలు ప్రభలే అవకాశం ఉన్నందున వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించాలని వేడివేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన, పరిశుభ్రమైన నీటిని త్రాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు జ్యోతి, రాజు, అంజయ్య, హెచ్ఏ నగేష్, ఏఎన్ఎం పుష్ప, ఆశా కార్యకర్తలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం



మునగాల, మేజర్‌న్యూస్ : ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను వారి నివాసం ఉండవల్లిలో మండల పరిధిలోని నర్సింహా పురం గ్రామానికి చెందిన. టిడిపి సీనియర్ నాయకులు సామాజిక కార్యకర్త డాక్టర్ వేమూరి సత్యనారాయణ కలిసి నియోజకవర్గ స్థాయి టిడిపి పార్టీకి సంబంధించిన వివిధ అంశాలను ప్రస్తావిస్తూ రాసిన లేఖను లోకేష్ కు అందజేసినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గంతో పాటు తెలంగాణాలో తెలుగు దేశం పార్టీ అవసరాన్ని ఇటీవల జరిగిన పార్టీ సంస్థాగత మండల కమిటీల నియామకాలు త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల గురించి గతంలో తాను చేసిన పార్టీ కార్యక్రమాలతో పాటు. గత పది హేను సంవత్సరాలుగా సామాజిక కార్యక్రమాలకు సంబంధించిన వివిధ దినపత్రికలో ప్రచురించిన ప్రతులను లోకేష్‌కు అందజేసినట్లు అదే విధంగా అధికారం దూరం అయి. ఇరవై సంవత్సరాలు పైబడిన. క్షేత్ర స్థాయిలో ఇప్పటికీ. కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో ఉన్నారని పార్టీ పెద్దలు. ఇక్కడ పార్టీ పై దృష్టి పెడితే తెలంగాణలో పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదే విధంగా ఇటీవల వివిధ దినప త్రికలో వచ్చిన వార్తల గురించి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు గురించి ప్రస్తా వించగా ప్రస్తుతం తెలంగాణా రాజకీయాలు తన చుట్టే తిరుగుతు న్నాయి అని రాబోయే రోజుల్లో తెలంగాణ పై దృష్టి పెడతాను అని నిరంతరం కార్యకర్తల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు తమకు రెండు రాష్ట్రాల ప్రజలు రెండు కళ్లు లాంటి వారని. రెండు దశా బ్దాలగా అధికారం లేకపోయినా పార్టీ కోసం కష్టపడి పని చేస్తూ పార్టీ ప్రతిష్టను కాపా డుతున్న నిస్వార్థ కార్యకర్తలకు ఔత్సాహిక యువత కు మహిళలకు సముచిత స్థానం కల్పిస్తామని ఇటీవల తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసు కున్న కార్యకర్త లకు దేశంలో ఏ పార్టీ ఇవ్వని విధంగా ఐదు లక్షల ప్రమా ద బీమా ఇస్తున్నాం అని పార్టీకి కార్యకర్తలే పునాది అని వారిని కాపోడుకోవడమే తమ లక్ష్యమని రాబోయే రోజుల్లో తెలం గాణ కార్యకర్తలకు అండగా ఉంటామని వారి బాధ్యత కూడా తానే తీసు కుని పార్టీని సంస్థాగతంగా మరింతగా బలోపేతం చేసేందుకు కార్యాచ రణ రూపొందించడం జరిగిందని లోకేష్ అన్నారని సత్యనారాయణ తెలిపారు.

# ఎమ్మెల్యేకు వినతి అందజేసిన తాజ్పూర్ గ్రామస్తులు



భువనగిరి, మేజర్‌న్యూస్ : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని తాజ్పూర్ గ్రామస్తులు శ్రీ శ్రీ శ్రీ లింగేశ్వర స్వామి దేవాలయ నూతన కమిటీని గ్రామంలో ఎవరి ప్రమేయం లేకుం డా దేవాదాయ శాఖ అధికారులు నూతన కమిటీని వేశారని అట్టి కమిటీని రద్దుచేయాలనితాజ్పూర్ గ్రామస్తులు, బి ఆర్ఎస్ పార్టీ జిల్లా యువ నాయకులు డా. ర్యాకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎవరికి తెలవకుండా ఎవరి ప్రమేయం లేకుండా శ్రీ శ్రీ లింగేశ్వర స్వామి దేవాలయం కమిటీని వెయ్యడం చాలా దారుణమని అన్నారు. అట్టి కమిటీని తక్షణమే రద్దుచేసి గ్రామంలోని అందరి అభిప్రాయం తీసుకొని నూతన కమిటీని వేయాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నాగరాజు, గిరిబాబు, మైసయ్య, వెంకటేష్, గోవర్ధన్, కిరణ్ సందీప్, రామకృష్ణ, మధు, కృష్ణ, రాములు, నరసింహ, రాజు, కొండల్, భాస్కర్, మహేష్, నరసింహ, రమేష్, బాలయ్య పోచయ్య, శంకరయ్య యువకులు తదితరులు పాల్గొన్నారు.

# తడి పొడి చెత్త పై అవగాహన

***భువనగిరి జిల్లా బ్యూరో***



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 100 రోజుల కార్యక్రమంలో భాగంగా 48వ రోజు అయినందున భువనగిరి పురపాలక సంఘం లో మున్సిపల్ కమిషనర్ రామలింగం గారు వివిధ వార్డులలో పర్యటించి ఈ క్రింద తెలిపిన వివిధ పనులను చేపట్టడం జరిగింది అని తెలిపారు. వార్డు వార్డులో అనగా వార్డు నెం.3, 7, 8, 11, 18లలో యందు తడి చెత్త అనగానేమి పొడి చెత్త అనగానేమి వివరముగా ప్రతి గృహిణికి వివరించి మరియు పారిశుధ్య వాహనానికి ఏ విధంగా అందించాలో వారికి వివరంగా వివరించడం జరిగింది అని అన్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా దోమల నివారణకై ఇట్టి వార్డులలో స్ప్రే చేయించడం మరియు నిల్వ ఉన్న నీటి గుంతలలో ఆయిల్ బాల్స్ వేయడం జరుగుతుంది అని తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్నటువంటి పిచ్చి మొక్కలను, చెత్తాచెదారమును శుభ్రం చేయడం జరుగుతుంది. దోమల నివారణకై నిల్వ ఉన్న నీటి పాత్రలను, నీటి గోళాలను, టైర్లు ట్యూబులు మరియు ఇతర పరిసరాలలో ఉన్నటువంటి నీటిని శుభ్రం చేయడం జరిగింది అని అన్నారు. స్థానిక సిఎస్ఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ బాలురు కళాశాల యందు మెప్మా వారి ఆధ్వర్యంలో సుమారు 31 ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు చేసి, కౌంటర్‌కు ఒక ప్రత్యేకత ఉండే విధంగా మహిళా సంఘాల వారు ఉత్పత్తి చేసే వివిధ రకాల తిను బండారములతో మరియు తెలంగాణకు సంబంధించిన అన్ని రకాల వంటలను ఫుడ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా ప్రజలకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలుగు ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించడం జరిగింది అని తెలిపారు. ఇటి కార్యక్రమంలో అధికారులు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, రెవెన్యూ అధికారి, శానిటరి ఇన్స్‌పెక్టర్, ఇన్చార్జ్ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్, ఇంచార్జి టౌన్ మిషన్ కో ఆర్డినేటర్, కమ్యూనిటి ఆర్గనైజర్, మహిళలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండ్ లెవెల్‌ను పూర్తి చేయాలి

## నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



కనగల్, మేజర్‌న్యూస్ : ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండ్ లెవెల్‌ను పూర్తి చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ల త్రిపాటి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం కార్యదర్శులకు హౌసింగ్ అధికారులకు ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మార్చి నెలలో ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం అర్హులకు మంజూరు చేసిందని వివరించారు. ఇప్పటివరకు గ్రౌండ్ లెవెల్ పూర్తి చేయని గ్రామపంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు పునాది లెవెల్ పూర్తి వెంటనే చేయాలన్నారు. ఎవరైతే మంజూరైన వారు ఇండ్లు కట్టలేని పరిస్థితిలో ఉన్నారు వారి నుంచి నేరుగా రాయించుకొని సంబంధిత అధికారులకు అందజేయాలన్నారు.. కార్యక్రమంలో తాసిల్దార్ పద్మ, ఇన్చార్జి ఎంపీడీవో కుంభం సుమలత రెడ్డి, హౌసింగ్ జిల్లా రాజ్ కుమార్, ఏఈ వెంకటేశ్వర్లు, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# సువర్ణం జ్యువెలర్స్ ఎగ్జిబిషన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## కాంగ్రెస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి



నల్లగొండ రూరల్, మేజర్‌న్యూస్ : గోల్డ్ జ్యువెలరీ అమ్మకాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న సువర్ణం జువెలరీ యాజమాన్యం నల్లగొండ పట్టణంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పట్టణ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో గల మనోరమ హోటల్లో సువర్ణం జువెలరీ వారి ఆధ్వర్యంలో ఆషాడం స్పెషల్ సేల్ బంగారం ఆభరణాల ఎగ్జిబిషన్‌ను ఆయన మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బోని రమేష్ గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సువర్ణం జువెలర్స్ స్టోర్ మేనేజర్ కమల కంటి కార్తీక్, మార్కెటింగ్ మేనేజర్ బొడ్డు సాయికుమార్లు మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా ప్రత్యేకమైన జువెలరీ డిజైన్లను ఎగ్జిబిషన్లో ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు బంగారు ఆభరణాలు పై ప్రత్యేక డిస్కౌంట్లు ఉన్నట్లు తెలిపారు. ఈనెల 19, నుండి 20 తారీకు వరకు ఈ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు వివరించారు ఆభరణాలను ఈఎంఐతో సౌకర్యంతో కొనుగోలు చేసే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యువెలరీ స్టాప్ కస్టమర్లు తదితరులు పాల్గొన్నారు.

# నెమ్మికల్ ప్రధానోపాధ్యాయులు సస్పెండ్

సూర్యాపేట కలెక్టరేట్, మేజర్‌న్యూస్ : ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నెమ్మికల్ ప్రధానోపాధ్యాయులు పి శ్రీహరిని సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూర్(ఎస్) మండల పాఠశాలలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ మహిళా ఉపాధ్యాయురాలుని వేధిస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో విచారణ చేసి జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు సస్పెండ్ చేసినట్లు వివరించారు.